ఈవారం బహుమతి పొందిన కథ

## కొత్త రచయితలు

న్యాయానికి ప్రతిరూపమైన ఆ న్యాయాధిపతి గుండెల్లో గుబులుపుట్టించిన ఆ సంఘటన ఏమిటి???

**డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేటు కోర్టులో ఆరోజు చాలా కోలాహలంగా ఉంది. వారంరోజుల నుంచి జరుగుతున్న విచారణ ఆ రోజు పూర్తి కాబోతున్నది. జడ్జి సత్యమూర్తిగారు చెప్పే తీర్పు మీద ఒక ఇరవై ఏళ్ళ యువతి జీవితం ఆధారపడి ఉన్నది. సత్యమూర్తిగారు న్యాయానికి ప్రతిరూపమని ఆయన జడ్జిమెంటుకు తిరుగువుండదని ప్రజల నమ్మకం. ఆ చిన్న జిల్లా న్యాయాధిపతిగా ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న దేవుడు ఆయన. అటువంటి వ్యక్తి ఈ రోజు న్యాయం చెప్పబోతున్నారంటే ఆసక్తి ఉన్న జనం రాకేం చేస్తారు. అందుకే అంత సందడిగా ఉంది.**



# సాక్షి

### ఉష

జడ్జిగారు వచ్చి కుర్చీలో కూచున్నారు. హాల్లో నిశ్శబ్దంగా ఉంది. ఎంతో జీవితాన్ని చూశామన్నట్లున్న ఆయన పండిన తల, కరుణగా కాంతివంతంగా మెరిసే ఆయన కళ్ళు, నిండైన భారీ విగ్రహాన్ని చూస్తుంటే ఎవరికైనా మొకరించాలనిపిస్తుంది. కూచుంటూ ఒకసారి హాలులో జనాన్ని, బోనులో నుంచున్న ఆ అమ్మాయిని చూసి తన ముందు ఉంచిన కాగితాల్ని చూసి నెమ్మదిగా తల ఎత్తారు. అక్కడ ఉన్న ఆ పిల్ల బేలగా భీతిగా ఆయననే చూస్తున్నది.

"ఇంతకీ ఏమిటి ఈపిల్ల చేసిన నేరం?"

"దొంగతనం"

"ఎవరింట్లో?"

"లాయర్ రామనాథం ఇంట్లో"

"ఏమిటీ వారింట్లోనే! ఏం పోయిందో?"

"బంగారు గొలుసు"! సన్నసన్నగా వినిపిస్తున్నాయి మాటలు.

"ఆర్డర్ ఆర్డర్" గట్టిగా బల్ల చరిచారు జడ్జిగారు.

"నీ పేరు" జడ్జిగారి గొంతు ఖంగుమంది.

"సీత"

"తండ్రి పేరు"

"తెలియదు". ఆ గొంతులో ద్వేషం కళ్ళల్లో కసి. జడ్జిగారు ఒకసారి కళ్ళెత్తి ఆమె కళ్ళల్లోకి చూసి కాసేపు నిశ్శబ్దంగా ఉండి[illegible]న్నారు.

"పోనీ తల్లి?" నెమ్మదిగా అడిగారు.

"చచ్చిపోయింది" గొంతు నిండుకొచ్చింది.

"చదువుకున్నావా?"

"ఏదో కొద్దిగా."

"ఈ ఊరేనా?"

"కాదు. ఈ ఊళ్ళో బతకటానికి వచ్చాను".

"ఎక్కడి నుంచి?"

"ఈ పక్కూరి నుంచి" ఈసారి ఆమె సమాధానం నిర్లిప్తంగా ఉంది.

ఎందుకో ఆయన మొఖం ఒకసారి ముడిపడింది. 'ఈ గొంతు!' అనుకున్నారొకసారి.

"లాయర్ గారి ఇంట్లో ఎన్నాళ్ళ నుంచి ఉంటున్నావు?"

"నాలుగు నెలల నుంచి"

"వాళ్ళు నిన్ను బాగా చూశారా?"

"చాలా బాగా"

"మరి దొంగతనం ఎందుకు చేశావు?"

ఆమె చివ్వున తల ఎత్తింది. "నేను దొంగతనం చేశానా? లేదు లేదు. ఈ వారంరోజుల నుంచి చెప్తున్నాను నేను దొంగను కాను."

"మరి ఈ గొలుసు"

"నాది" గుండెల మీద చెయ్యివేసుకుని దృఢంగా చెప్పింది. జడ్జి సత్యమూర్తి గారు ఒకసారి నిట్టూర్చారు. గొంతు సవరించుకుని "చూడు పనిచేసుకు బతుకుతున్న దానికి బంగారు గొలుసు ఉండకూడదని నేను అనను. కానీ చాలా రోజులు తిండికి కూడా

వారం వారం ఈ కొత్త రచయితల శీర్షికలో రూ.116 బహుమతిగా అందజేస్తాం

లేక వస్తువున్నానన్నావు అప్పుడూ దీన్ని నీ దగ్గరే ఉంచుకున్నావా?''

ఆమె మాట్లాడలేదు...

''లాయర్ గారి ఇంటికి వచ్చినప్పుడు కూడా ఇది నీ దగ్గరే ఉందా?''

ఉందన్నట్లు తల ఊపింది.

''అప్పుడు వాళ్ళు దీన్ని చూడలేదా?''

లేదని తల ఊపుతూ ''దీన్ని నేను ఎప్పుడూ మెడలో వేసుకోలేదు. నా బొడ్లో దాచుకునేదాన్ని.''

''ఎందుకు ఎవరన్నా తీసుకుంటారని భయమా?''

''కాదు ఆలాకెట్ నా గొంతు పిసుకుతున్నట్లు ఉంటుంది.''

జడ్జిగారు ఆశ్చర్యంగా ఒకసారి ఆ గొలుసు వంక, ఆమె మొహంలోకి చూశారు.

''సరే పోనీ ఈ గొలుసు నీదేనని అనటానికి ఏదన్నా ఒక్క సాక్ష్యం చూపించగలవా?''

''ఒక్కసారి దాన్ని నా చేతికి ఇప్పించండి సాక్షిని చూపిస్తాను'' అన్నది ఆశగా.

ఆయన పెదవుల మీద చిన్నగా ఒక లాసరేఖ మెరిసి మాయమైంది.

''ఇది ఆమెకియ్యండి'' అన్నారు వ్యంగ్యంగా.

కొంతసేపటికి ఆ గొలుసు ఆమె చేతికి వచ్చింది. ఆమె దాన్ని అందుకుని ఒకసారి కసిగా చూసింది. దానికి ఉన్న లాకెట్‌ని తడుముతూ ''జడ్జిగారూ మీరు నన్ను ఏం చదివావూ అని అడిగారు. నేను బి.ఏ. దాకా చదివాను.కానీ అది నాకు బతుకు తెరువు చూపించలేకపోయింది. పతిత కూతురు పతిత కాక తప్పదని శాసించింది ఈ పురుష ప్రపంచం. మా అమ్మ నన్ను సంఘంలో గౌరవంగా నిలబెట్టాలన్న తాపత్రయంతోనే కన్ను మూసింది. ఆవిడ పోతూ పోతూ దీన్ని నా చేతిలో పెట్టి ఈ లాకెట్‌లోని వ్యక్తిని కలుసుకో అని మాత్రం చెప్పింది. అందుకే ఈ ఊరు వచ్చాను'' అంటూ ఆ లాకెట్ ఊడదీసి. ''చూడండి. ఇతనే ఈ గొలుసు నాదనటానికి సాక్షి'' అంటూ దాన్ని తిరిగి అందించింది.

జడ్జి సత్యమూర్తిగారు దాన్ని అందుకుని కళ్ళజోడు సవరించుకుంటూ చూసి ఉలిక్కిపడ్డాడు. ఆ సాక్షి ఎవరోనని జనం ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకోవడం మొదలు పెట్టారు. జడ్జిగారి గుండె చప్పుడు ఆయనకే అతి భయంకరంగా వినిపిస్తున్నది. ఆయన కూచున్న న్యాయపీఠం బరువెక్కి భూమిలోకి దిగుతున్నట్టనిపించింది. తాను నమ్మిన న్యాయదేవత వికటాట్టహాసం చేస్తూ కళ్ళ ముందు తిరుగుతున్నది. ఆ గొలుసు- అవును ఆ గొలుసు తనది. ఎప్పుడో చదువుకునే రోజుల్లో తన ప్రేమ దేవతకు ఇచ్చిన కానుక. కానీ తర్వాత ఆవిడ తనకు కనిపించలేదు. ఇన్నేళ్ళ తర్వాత ఈ విధంగా అంటే ఈ అమ్మాయి ఇంక ఆలోచించలేకపోయారు. అతడి గుండె బరువెక్కింది. ఎడం చేత్తో గుండెను గట్టిగా పట్టుకుని కళ్ళుమూసుకున్నారు. కుడి చేతిలోని గొలుసు జారి కిందపడింది. గడియారం అయిదు గంటలు కొట్టింది. జడ్జిగారి తల వాలిపోయింది.

○

# ఫోటో గ్రాఫర్

జి.సత్యం

ఆ అమ్మాయి నవ్వితే — పాలమరుగులాంటి 'తెల్లని పళ్ళు' తళుక్కున మెరిసాయి. పరువపు ప్రాయపు వయస్సుకు, 'పైట' తెచ్చిన అందంతో... చూడముచ్చటగా, అద్భుతంగా ఉందా అమ్మాయి.

''ఎక్కడ తీస్తావు ఫోటో...?'' ఆ అమ్మాయి నాముందుకు వచ్చి ప్రశ్నించింది.

ప్రకృతిని చూసి, ఆ అమ్మాయిని పరిశీలించి, ప్రకృతిలోని అందాలన్నింటినీ, తనలో... ఇముడ్చుకొన్న, పోతపోసిన పుత్తడిబొమ్మలా... ఉన్న ఆ అమ్మాయిని, నాతోపాటు ఓ చోటికి తీసుకువెళ్లాను.

నా వెంట వచ్చిన ఆ అమ్మాయి, ఓ చెట్టు చాటున, చిత్రమైన భంగిమలో నిల్చుని, నన్ను అలరించింది. చేతిలోని కెమరాతో... తదేకంగా ఆ అమ్మాయిని చూస్తూ... కెమరాని 'క్లిక్' మనిపించాను.

ఆ అమ్మాయి రూపం, కెమెరాలో భద్రపడినట్లే— నా మనస్సు లోపొరల్లోను, గుండె గుబుల్లోను భద్రపడింది.

తలలో... ఇమిడిన గులాబి మొగ్గ, నుదుట నే దిద్దిన తిలకం, చెవులో వ్రేలాడే— జూమికీలు, మెడలో జారే ఒంటిపేట చైను ఆ అమ్మాయికి అందాన్నిస్తుంటే— వాటన్నిటికి మించి, ఆ అమ్మాయికి అతికినట్లున్న పమిట, ఆ అమ్మాయి అందాన్ని మరింత పెంచుతోంది.

నేను ఫోటోగ్రాఫర్‌ని. ఫోటోగ్రాఫర్‌గా నా కళ్ళు ఎందరినో... పరికించాయి. అయితే— నా మనస్సుకు నచ్చేవిధంగా, అద్భుత సౌందర్యంతో... కనిపించిన అమ్మాయి ఈ అమ్మాయే—

ఆ అమ్మాయి ఆలోచనతో... నా మనస్సు బరువెక్కింది. చిత్రంగా నాలోని అణువణువు స్పందిస్తోంది.

'ఆలోచన రాకూడదు వస్తే ఒక్క పెట్టున వదలదు' అని ఎవరో... అన్నట్లు, ఆ అమ్మాయిని చూడగానే— ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనలో... మనస్సు ఎటో తేలుతోంది. ఊహల్లో ఆ అమ్మాయితో జీవిస్తున్నాను.

ఆ అమ్మాయి 'కాఫీ' అందించి లోనికెళ్ళింది. కాఫీ తాగుతూనే ఉన్నా... ఆ అమ్మాయి ఇంతకుముందు వేసుకున్న దుస్తులు మార్చుకొని, పొట్టి లంగాతో.. పాలుగారే బుగ్గలతో.. పసితనం పోని చేష్టలతో.. నా వెనకమాటుగా వచ్చి, ''ఫోటో ఎప్పుడొస్తుంది'' అంటూ... కుర్చీ పట్టుకుని ఊగుతూ.. అడిగింది.

ఆ అమ్మాయిని అలా చూడగానే— ఇంతకుముందు వయస్సు వేడిమితో.. కోరికల తాపత్రయంతో.. నా కళ్ళకు కట్టిన పొరలు తొలగిపోయాయి. ''ఏమి చదువుతున్నావు పాపా...?'' అంటూ ప్రశ్నించాను.

''ఆరవ తరగతి'' అంటూ ముందుకొచ్చింది ఆ పాప. మలినమయిన మనస్సుని కడిగేసి, నిష్కలమయిన మనస్సుతో... ఆ పాప బుగ్గలు నొక్కి సెలవు తీసుకున్నాను.

ఇప్పుడు నా మనస్సులో ఏ (దురుద్దేశ) 'ఆలోచనలు' లేవు.

○